MRR 69 TV
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 265 | మంగళవారం 15 జూలై 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి

- విజయవాడ క్లబ్ లో ఎన్నికలు
- అధ్యక్ష, కార్యదర్శితో సహా మిగిలిన పదవులకు ఎన్నికలు
- ఆగస్టు 3న నామినేషన్లు.. ఆగస్టు16న పోలింగ్
- షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్




**(అంకుశం, ప్రతినిధి అమరావతి, జులై 15):**

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు బీసీసీఐకి అనుబంధంగా గత 70 సంవత్సరాలు పైగా ఆంధ్రాలో క్రికెట్ అభివృద్ధి కోసం పని చేస్తున్నఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)లో ఎన్నికల సందడి నెలకొంది. ఆగస్టు 16న ఎన్నికలు నిర్వహణకు సంబంధించి ఏసీఏ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇదిలా ఉండగా ఒక వైపు ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌ను వచ్చే నెలలోనే , విశాఖపట్నంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నందు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు క్రికెటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండాఅసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తుండగా మరోవైపు ఎన్నికల నిర్వహణలో బిజీబిజీగా గడిపే అవకాశాలు లేకపోలేదు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారితో పాటు కౌన్సిలర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రస్తుతం ఏసీఏ అధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పి.వెంకటరామ ప్రశాంత్, సంయుక్త కార్యదర్శిగా విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్‌గా దంతు గౌర్ విష్ణుతేజ్‌లు కొనసాగుతున్నారు. తిరిగి వీరే పోటీ చేస్తారా లేదా కొత్త వ్యక్తులు పోటీ చేస్తారా అనేది అసోసియేషన్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. జిల్లా అసోసియేషన్, క్లబ్బుల సభ్యులకు సంబంధి తమ అధీకృత ప్రతినిధుల పేర్లను జులై 18లోగా పంపాలని ఎన్నికల అధికారి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. జిల్లాల వారీగా పంపిన జాబితాపై అధీకృత ప్రతినిధి అర్హతకు సంబంధించి ఏదైనా అభ్యంతరం ఉంటే 25వ తేదీలోగా పంపాలని సూచించారు.

**విజయవాడ క్లబ్‌లో ఎన్నికలు..**

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో ఆగస్టు 16న జరగనున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు సభ్యులందరూ సహకారం - మిగతా2లో

## కేంద్ర ప్రభుత్వం తరఫున మరింత సహకారం అందించాలి



- కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాతో సీఎం చంద్రబాబు భేటీ
- రాష్ట్రానికి ఆర్థిక సాయం సహా పలు అంశాలపై ఆయనతో చర్చించిన బాబు
- ఏపీకి అండగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సీఎం ధన్యవాదాలు
- వైకాపా హయాంలో రాష్ట్రంలో ధ్వంసమైన ఆర్థికవ్యవస్థను కేంద్రం అండతో గాడిలో పెడుతున్నాం
- గోదావరి మిగులు జలాలను వినియోగించుకునే హక్కు ఏపీకి ఉంది

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి దిల్లీ**

కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 40 నిమిషాలపాటు కొనసాగిన ఈ సమావేశంలో పలు అంశాలను కేంద్రమంత్రికి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం సహా పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఏపీకి అండగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. తెదేపా సీనియర్ నేత అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా - మిగతా3లో

## జగన్ హయాంలో ఆరోగ్య రంగం పూర్తిగా క్షీణించింది



- ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 2 వందల కోట్లు కేంద్రం నుంచి వచ్చే అవకాశం ఉన్న గత జగన్ ప్రభుత్వంలో కేవలం రూ.38 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి
- 2020లో నేషనల్ హెల్త్ అర్బన్ 15వ ఫైనాన్స్ కమిషన్ కింద 520 యూపీహెచ్సీలు మంజూరు
- ప్రస్తుత యూపీహెచ్సీని కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించాం
- విశాఖకి 48 యూపీహెచ్ఎల్‌లు మంజూరయ్యాయి

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి విశాఖపట్నం**

సీఎం చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో ఏపీలో వైద్యరంగంలో సంస్కరణలు తెచ్చామని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉద్ఘాటించారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 2 వందల కోట్లు కేంద్రం నుంచి వచ్చే అవకాశం ఉన్న గత జగన్ ప్రభుత్వంలో కేవలం రూ.38 కోట్లు మాత్రమే మంజూరయ్యాయని చెప్పుకొచ్చారు. ఇవాళ(మంగళవారం) విశాఖపట్నం మెంటల్ హాస్పిటల్‌లోని ఏకడమిక్ - మిగతా3లో

## చంద్రబాబు సర్కార్ మా భూములు లాక్కుంటుంది



- ప్రభుత్వం బలవంతంగా భూములను లాక్కోవాలని చూస్తోంది
- పచ్చని పంట పొలాలను లాక్కుంటే తమ పరిస్థితి ఏంటంటూ ఆవేదన
- రైతులకు ధైర్యం చెప్పిన వైఎస్ జగన్..
- మీ పోరాటానికి అండగా ఉంటామంటూ భరోసా

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి తాడేపల్లి**

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కరేడు గ్రామ రైతులు కలిశారు. చంద్రబాబు ప్రభుత్వం బలవంతంగా భూములను లాక్కోవాలని చూస్తోందంటూ ఫిర్యాదు చేశారు. పచ్చని పంట పొలాలను లాక్కుంటే తమ పరిస్థితి - మిగతా3లో



## సీఎంల భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదు

- కేంద్రానికి తెలంగాణ లేఖ.. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం
- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం
- బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవు
- చట్టాలు, ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని లేఖలో ప్రస్తవన
- గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితం
- ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుంది

# కలకలం రేపుతున్న విజయిసాయి ట్వీట్

**విజయవాడ :** నేను రాజకీయాలకు దూరంగా ఉన్నానేమో కానీ రాజకీయం మాత్రం నా నుంచి దూరంగా లేదు" అంటూ అప్పట్లో చిరంజీవి చెప్పిన డైలాగ్ ఇప్పుడు విజయసాయిరెడ్డికి కరెక్ట్‌గా సరిపోతుంది. తనకు ఈ రాజకీయాలు వద్దు వ్యవసాయం చేసుకుంటానని చెప్పి వెళ్లిపోయి ఆరు నెలలు దాటింది. అయినా సరే ఆయనను మాత్రం రాజకీయాలు వదలడం లేదు. ఏదో రూపంలో రాజకీయాల్లో ఆయన పేరు వినిపిస్తూనే ఉంది. ఈ మధ్య కాలంలో మరింత ఎక్కువైంది. వీటికి తోడు ఆయన చేసిన ట్వీట్ మరింత ఆసక్తిని రేపుతోంది. విజయసాయిరెడ్డి ట్వీట్ చూస్తే మాత్రం ఆయన రాజకీయ రంగ పునఃప్రవేశానికి రెడీ అయినట్టు స్పష్టమవుతోంది. అయితే ఏ పార్టీలోకి వెళ్తారు ఆయనకి ఉన్న ఆప్షన్స్ ఏంటో ఒక్కసారి పరిశీలిస్తే... విజయసాయిరెడ్డి వైసీపీలోకి రావాలని ఓ వర్గం నేతలు బలంగా కోరుకుంటున్నారు. ఈ మధ్య వైసీపీ సోషల్ మీడియాలో కూడా విజయసాయి రెడ్డి రీ ఎంట్రీపై చర్చ సాగింది. దీన్ని కొందరు స్వాగతిస్తుంటే మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. వైసీపీలోకి విజయసాయిరెడ్డి వస్తే ప్రత్యర్థులకు చుక్కలే అంటూ కూడా కొందరు కామెంట్ చేశారు. దీన్ని వ్యతిరేకించిన వాళ్లు కూడా అదే రేంజ్‌లో ఉన్నారు. ఆయన్ని నమ్మే పరిస్థితిలో జగన్ లేడనే వాళ్లు లేకపోలేదు. అయితే వైసీపీ అధినాయకత్వంపై విజయసాయిరెడ్డి ఘాటుగానే విమర్శలు చేశారు. సజ్జల, వైవి సుబ్బారెడ్డిని టార్గెట్ చేస్తూ ఆరోపణలు గుప్పించారు. జగన్‌పై ఎలాంటి విమర్శలు చేయకపోయినప్పటికీ వారి మాటలు విని తనపై ద్వేషం పెంచుకున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ని మళ్లీ వైసీపీ అక్కున చేర్చుకుంటుందా అనేది అనుమానమే. అయితే ఇంతకంటే దారుణంగా మాట్లాడిన వాళ్లనే జగన్ అక్కున చేర్చుకొని మంత్రిపదవులు ఇచ్చారని




వారితో పోల్చుకుంటే విజయసాయిరెడ్డి చాలా బెటర్ అంటున్నారు. బొత్స, ధర్మాన ప్రసాదరావు, వంశీ లాంటి వాళ్లను గుర్తు చేస్తున్నారు.ఒకవేళ విజయసాయిరెడ్డిని జగన్ ఆహ్వానించినా మిగతా నాయకులతో పొసగడం అంత ఈజీ కాదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారిపై విమర్శలు చేసిన వ్యక్తి ఇప్పుడు వారితో కలిసి పని చేసే పరిస్థితి ఉంటుందా అనేది అనుమానే అంటున్నారు. ఆయన స్థాయికి తగ్గట్టు ఉండదని భవిష్యత్‌లో ఎలాంటి పదవుల్లో కూడా ప్రాధాన్యత ఉండకపోవచ్చనే మాట గట్టిగా వినిపిస్తోంది. అందుకే అలాంటి ఆలోచన విజయసాయిరెడ్డి చేయకపోవచ్చని మాట బలంగా వినిపిస్తోంది. రెండో ఆప్షన్ బీజేపీ. విజయసాయిరెడ్డికి బీజేపీ అధినాయకత్వం వద్ద మంచి పలుకుబడే ఉంది. వైసీపీతో పోల్చుకుంటే బీజేపీ నేతలతో ఎలాంటి విభేదాలు లేవు. కేవలం రాష్ట్రంలో టీడీపీ, జనసేన నేతలు మాత్రమే అభ్యంతరం చెప్పే అవకాశం ఉంది. ఢిల్లీ నుంచి నెల్లూరు బీజేపీ వరకు అందరూ ఆయన్నిఆహ్వానించే వాళ్లే అంటున్నారు. ఉన్న రెండు ఆప్షన్స్‌లో దీనికే విజయసాయిరెడ్డి మొగ్గు చూపుతారని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. భగవద్గీత శ్లోకం చెప్పిన విజయసాయి రెడ్డి బీజేపీలోకి వెళ్తున్నట్టు హింట్ ఇచ్చారనే వారు ఉన్నారు. ప్రతిపక్షంతోపాటు అన్ని రాజకీయా పార్టీలు రాజధర్మాన్ని పాటించాలనే స్టేట్మెంట్‌తో తన ట్వీట్ ప్రారంభించారు. కర్మణ్యే వాధికారస్తే అనే శ్లోకంతో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కర్మలను ఆచరించడంపైనే అధికారము ఉంటుందని వాటి ఫలితాలపై ఉండదని చెప్పుకొచ్చారు. ఆ ఆ ఫలితాలకు కారణం కాకూడదని అలాగనే పనులు చేయకుండా ఉండొద్దని అన్నారు. ఇది కచ్చితంగా తన పొలిటికల్ రీ ఎంట్రీపై ఇచ్చిన హింటే అంటున్నారు అభిమానులు. ఈ ట్వీట్‌పై మరో వాదన కూడా వినిపిస్తోంది. లిక్కర్ కేసులో విజయసాయిరెడ్డిని మరోసారి సిట్ పిలిచింది. దానిని ఉద్దేశించే పెట్టి ఉంటారని అంటున్నారు. సిట్ విచారణ ఫలితం ఎలా ఉన్నా సరే నీకు తెలిసింది చెప్పి రావడం ధర్మం అనే యాంగిల్‌లో ఈ ట్వీట్‌ను డీ కోడ్ చేస్తున్నారు మరికొందరు. ఏమైనా సరే విజయసాయిరెడ్డి మాత్రం ఒక్క ట్వీట్‌తో అందరి బుర్రలకు పని చెప్పారు. ఆయన సీఏ బుర్రలో ఏముందో తెలియదు కానీ దాన్ని డీ కోడ్ చేసే పని మాత్రం సోషల్ మీడియాకు ఇతరులకు ఇచ్చేశారు. దీనిపై ఎవరు ఎన్ని విశ్లేషణలు చేసినా సిట్ విచారణకు వచ్చినప్పుడు ఆయన చెప్పే విషయాల కోసం మరికొందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# పదవికి వన్నె తెచ్చే గజపతిరాజు...

**విజయనగరం :** మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు అనుకున్నట్లే గవర్నర్ పదవి లభించింది. దేశంలో మొత్తం మూడు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హర్యానా గవర్నర్ గా ప్రొఫెసర్ ఆషిమ్ కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ గా రకవీందర్ గుప్తా, గోవా గవర్నర్ గా పూసపాటి అశోక్ గజపతి రాజును నియమించారు. దీంతో మరో తెలుగు గవర్నర్ బండారు దత్తాత్రేయను మరో రాష్ట్రానికి గవర్నర్ గా నియమిస్తారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటికే ఇంద్రసేనారెడ్డితో పాటు ఏపీకి చెందిన కంభంపాటి హరిబాబులు గవర్నర్ లుగా ఉన్నారు. అంటే తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు గవర్నర్లకు మాత్రమే అవకాశం ఉందా? అన్న సందేహం కలుగుతుంది.పూసపాటి అశోక్ గజపతి రాజు అందరికీ సుపరిచితులే. గత ఎన్నికల్లో ఆయనకు విజయనగరం ఎంపీ టిక్కెట్ ఇవ్వకుండా ఆయన కుమార్తె ఆదితి గజపతి రాజుకు విజయనగరం ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినప్పుడే రాజుగారు గవర్నర్ అవుతారన్న ప్రచారం మొదలయింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కాలం తర్వాత పూసపాటి అశోక్ గజపతి రాజు గవర్నర్ గా నియమితులైయ్యారు. పెద్దాయన అంటే పార్టీలో అందరికీ గౌరవమే. నీతికి నిజాయితీకి పేరు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్ నేత అశోక్ గజపతి రాజు అనేక సార్లు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో మంత్రిగా చేసినా ఎటువంటి ఆరోపణలు ఆయనపై రాలేదు. నిక్కచ్చిగా ఉండే నేతల్లో అశోక్ గజపతి రాజు ఒకరు.ప్రస్తుతమున్న రాజకీయాల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుని డిసైడ్ అయి తన వారసురాలిని పాలిటిక్స్ లోకి దించారు. అశోక్ గజపతి రాజు చంద్రబాబు నాయుడుతో సమానమైన రాజకీయ అనుభవం ఉన్న నేత. విజయనగరం జిల్లా అంటేనే టీడీపీలో మొదట గుర్తొచ్చేది ఆయన పేరే. అలాంటిది అశోక్ గజపతి రాజు ఎటువంటి పదవి లేకుండా ఏడాది నుంచి కోటలోనే పరిమితమవుతుండటం ఆయనను అభిమానించే వారికి మనస్తాపం కలిగించేదే. ఆయన ఎక్కువ సమయం హైదరాబాద్ లోనే ఉంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయన ట్రస్ట్ విషయంలోనూ ఇబ్బంది పెట్టింది. న్యాయస్థానాలకు వెళ్లి పోరాడాల్సి వచ్చింది.టీడీపీలో సీనియర్ నేతలను పక్కన పెట్టాల్సి రావడం, యువతకు ప్రాధాన్యత ఇవ్వాల్సి రావడంతో ఆయనకు గత ఎన్నికల్లో టిక్కెట్ నాయకత్వం ఇవ్వలేదు. భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటుండటంతో సీనియర్ నేత అయిన అశోక్ గజపతి రాజును గవర్నర్ గా నియమిస్తారని ఎప్పటి నుంచో ప్రచారం జరిగింది. పూసపాటి అశోక్ గజపతి రాజు కూడా తనకు రావాల్సిన సమయంలోనే వస్తుందని, అప్పటి వరకూ వెయిట్ చేయడమే తప్ప ఏం చేయలేమని గ్రహించిన రాజుగారు ఏడాది కాలం నుంచి మౌనంగానే ఉంటున్నారు. 1951లో జన్మించిన అశోగ్ గజపతిరాజు గ్వాలియర్ లోని సింధియా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో చదువుకున్నారు. మంచి భావాలు కలిగిన నేతగా ఆయన పేరు తెచ్చుకున్నారు. చంద్రబాబు కేబినెట్ లో క్షత్రియ సామాజికవర్గానికి మంత్రి పదవి దక్కనప్పుడు కూడా పూసపాటి అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి ఖాయమని అనుకున్నారు. ఈలోపు డిప్యూటీ స్పీకర్ గా రఘురామ కృష్ణరాజును నియమించడంతో క్యాబినెట్ ర్యాంక్ కావడంతో ఇక అశోక్ గజపతి రాజుకు గవర్నర్ గిరీ రాదేమోనన్న ఆందోళన అందరిలోనూ ఉంది. కానీ అందరి ఆలోచనలు పటాపంచలు చేస్తూ ఆయన గవర్నర్ గా నియమిస్తూ విజయనగరం జిల్లా?లోనే కాకుండా రాష్ట్రంలోని టీడీపీ అభిమానులందరూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# సీఎంల భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదు

**హైదరాబాద్/న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లో నీటి వివాదం కొత్త మలుపు తిరిగింది. బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం షాకిచ్చింది. ఈ ప్రాజెక్టుపై చర్చకు ససేమీరా చెబుతూ కేంద్ర ప్రభుత్వానికి తాజాగా ఓ లేఖ రాసింది. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో రేపు(జూలై 16, 2025) అత్యున్నత స్థాయి సమావేశం జరగాల్సి ఉంది. ఇందులో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనాల్సి ఉంది. ఇందులో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, పర్యావరణ అనుమతులు, జల వివాదాలు ప్రధాన అంశాలు చర్చిస్తారనే ప్రచారం తెర మీదకు వచ్చింది. ఈ క్రమంలో..




గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల సీఎంలకు పిలుపు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై అభ్యంతరం తెలిపింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే రేపటి సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయహోదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని లేఖలో ప్రస్తావించింది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని తెలిపింది.

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 16న (బుధవారం) సమావేశం కానున్నారు. ఈ మేరకు జలశక్తిశాఖ ఇరు రాష్ట్రాల సీఎంల కార్యాలయాలు, సీఎస్‌లకు సమాచారం పంపించింది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తిభవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుంది. ఈ అంశంతోపాటు రాష్ట్రాల తరఫున మాట్లాడాల్సిన ఇతర ఎజెండా పాయింట్లు ఏమైనాఉంటే వెంటనే పంపాలని జలశక్తిశాఖ కోరింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ అజెండా ఇచ్చింది. వాస్తవానికి ఈ నెల 11న సమావేశం నిర్వహించాలని నిర్ణయించి ముఖ్యమంత్రుల సమయం కోరినా, సానుకూల స్పందన రాకపోవడంతో 16వ తేదీకి వాయిదా వేశారు. ఈ తేదీన హాజరుకావడానికి ఇద్దరు ముఖ్యమంత్రులు అంగీకరించినట్లు తెలిసింది. ఏపీ పునర్విభజన చట్టం మేరకు కొత్త ప్రాజెక్టులు, జల వివాదాలకు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, రెండు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా గల ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉంది. గత పదేళ్లలో రెండు సమావేశాలు జరిగాయి. ఇటీవల ఏపీ ప్రభుత్వం గోదావరి వరద జలాలను వినియోగించుకొనేందుకు బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఇప్పటికే దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి అభ్యంతరం వ్యక్తంచేశారు. పర్యావరణ అనుమతులు, కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు ఇవ్వొద్దంటూ లేఖలు రాశారు. గోదావరి-బనకచర్ల వల్ల తెలంగాణలోని ప్రాజెక్టులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ గట్టిగా వాదన వినిపిస్తున్న నేపథ్యంలో కేంద్రమంత్రితో జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకొంది.

ఇప్పటివరకు బనకచర్ల ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవు. బీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, ఈఏసీలు సైతం అభ్యంతరాలు తెలిపాయి. చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పును ఉల్లంఘించే బనకచర్లపై రేపటి సమావేశంలో చర్చించాల్సిన అవసరం లేదు. ఇతర అంశాలపై చర్చి?స్తేనే మీటింగ్‌కు వస్తామని తెలంగాణ ప్రభుత్వం లేఖ ద్వారా కేంద్రానికి స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాల నడుమ బనకచర్ల ప్రాజెక్టు వివాదాస్పదంగా మారింది తెలిసిందే. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి వరద జలాలను రాయలసీమకు మళ్లించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో రేపటి చర్చలు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారానికి కీలకంగా మారే అవకాశం ఉందని అంతా భావించారు. అయితే తెలంగాణ ప్రభుత్వ తాజా లేఖతో జరగబోయే పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

**తెలంగాణ అభ్యంతరాలు**

ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టానికి విరుద్ధమని వాదన

గోదావరి ట్రైబ్యునల్ కేటాయింపులకు వ్యతిరేకంగా ఉందని అభిప్రాయం

నాగార్జునసాగర్ వాడకాన్ని తప్పుబడుతూ, పర్యావరణ నష్టం గురించి ఆందోళన

**ఏపీ వాదనలు**

వర్షాకాలంలో సముద్రంలో కలిసిపోతున్న వరద జలాలను వినియోగించాలన్న ఉద్దేశం

రూ.80,000 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు ప్రతిపాదన

3 దశల్లో నిర్మాణం: పోలవరం ? బొల్లపల్లి ? బనకచర్ల

ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల ప్రతిపాదనలను కేంద్రం వెనక్కి పంపించివేసింది. ఈ ప్రాజెక్టుపై పర్యావరణ నిపుణుల కమిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసిందని తెలిపింది. ఈ క్రమంలోనే గోదావరి వరద జలాల లభ్యతపై అధ్యయనం చేయాలని ఏపీ ప్రభుత్వానికి సూచించింది.

## ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి

-మొదటిపేజీ తరువాయి

అందించాలని ఎన్నికల అధికారి ఎన్. రమేష్ కుమార్ కోరారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా తనకు సహాయ సహకారాలు అందించేందుకు వీలుగా ఎం. అవినాష్ రెడ్డి, మొబైల్ నంబర్: 9705875020 అనే వ్యక్తిని నామినేట్ చేసినట్లు తెలిపారు.

పోటీ చేసేందుకు అర్హతలు..

జిల్లా అసోసియేషన్ లేదా క్లబ్‌లో సభ్యుడిగా ఉంటేనే ఆగస్టు 16న గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో నిర్వహించనున్న ఏసీఏ ఎన్నికల వార్షిక సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు అర్హులు. అదేవిధంగా ఐదు ఆఫీస్ బేరర్ పదవులకు, ఒక కౌన్సిలర్ పదవికి జరిగే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు.

70 ఏళ్లు దాటితే పోటీకి అనర్హులు..

ఇదిలా ఉండగా భారత పౌరుడు కాకపోతే, 70 సంవత్సరాల వయస్సు దాటితే, దివాలా తీసినట్లు లేదా మానసిక స్థితి సరిగా లేనట్లు ప్రకటించబడితే, మంత్రి లేదా ప్రభుత్వ ఉద్యోగి అయితే, 9 సంవత్సరాల పాటు ఏసీఏలో ఆఫీస్ బేరర్‌గా ఉన్నా, నేరారోపణలకు పాల్పడినందుకు కోర్టు ద్వారా దోషిగా నిర్ధారించబడి జైలు శిక్ష పడినా, ఏసీఏలో వరుసగా రెండు పర్యాయాలు (6 సంవత్సరాలు) ఆఫీస్ బేరర్‌గా పనిచేసిన తర్వాత 3 సంవత్సరాల కూలింగ్ పీరియడ్‌ను పూర్తి చేయకపోవడం వంటి వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు.

ఈ నెల 21న ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఫిర్యాదు చేయాలి. అభ్యంతరా అనంతరం ఈ నెల 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఆగస్టు 3న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ల స్క్రూటినీ అనంతరం 13న పోటీ చేసేందుకు అర్హులైనవారి పేర్లను ప్రకటిస్తారు. 16న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ నిర్వహించి తర్వాత కౌంటింగ్ ప్రారంభించి మధ్యాహ్నం తర్వాత ఫలితాలు ప్రకటిస్తామనిఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ వెల్లడించారు.

## చంద్రబాబు సర్కార్ మా భూములు లాక్కుంటుంది

-మొదటిపేజీ తరువాయి

ఏంటంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ధైర్యం చెప్పిన వైఎస్ జగన్.. మీ పోరాటానికి అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. అవసరమైతే గ్రామానికి కూడా వస్తానని జగన్ చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన యాదవ్ మాట్లాడుతూ.. కరేడులో భూసేకరణ వెనుక పెద్ద కుట్రలు ఉన్నాయన్నారు. ఆల్రెడీ ఇండోసోల్‌కు భూములు తీసుకుని మళ్ళీ భూసేకరణ ఎందుకు? అంటూ ఆయన ప్రశ్నించారు. "పచ్చని పంటపొలాలను లాగేసుకుంటామంటే ఒప్పుకోం. వైఎస్ జగన్‌ని కలిసి ప్రభుత్వ కుట్రలను వివరించాం. ఇండోసోల్ కి ఆల్రెడీ భూములు ఎలాట్ చేసి ఇప్పుడు మరోచోట ఇస్తామంటూ భూములు సేకరించటం కరెక్ట్ కాదని మధుసూదన యాదవ్ అన్నారు.

కరేడు గ్రామ రైతు మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ.. మా రైతుల సమస్యలను వైఎస్ జగన్‌కి వివరించాం. మాకు అండగా ఉంటామని జగన్ భరోసా ఇచ్చారు. జగన్ మా గ్రామానికి వస్తానన్నారు. మా ప్రాణామైనా ఇస్తాం.. కానీ ప్రభుత్వానికి మా భూములు ఇవ్వం. పరిశ్రమల పేరుతో భూములు లాక్కోవాలని చూస్తున్నారు. ఇండోసోల్ పేరుతో భూ వ్యాపారం చేస్తామంటే సహించం. సెంటు భూమి కూడా ఈ ప్రభుత్వానికి ఇచ్చేదిలేదు ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ.. "మా హయాంలో రామాయపట్నం పోర్టు తెచ్చినప్పుడు ఒక్క సమస్య కూడా రాలేదు. బాధితులకు నచ్చచెప్పి పునరావాసం కల్పించాం. ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కావాల్సిన భూములు కూడా ఇచ్చాం. కానీ చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేసింది. ఇండోసోల్‌ను బలవంతంగా మరో చోటకు తరలించాలని చూస్తోంది. కరేడులో అన్ని రకాల పంటలు పండుతాయి. ..సంవత్సరం పొడవునా పంటలు పండే గ్రామం అది. రెండున్నర వేల మత్స్యకార కుటుంబాలను ఖాళీ చేయించాలని చూస్తున్నారు. ఎస్టీలంతా గ్రామంలోని పొలాల్లో పనులు చేసుకుని బతుకుతారు. వారిని కూడా వెళ్లగొట్టాలని చూస్తున్నారు. కరేడులో 18 వేల మంది ఉన్నారు. వారందరినీ రోడ్డున పడేయాలని చూడటం కరెక్ట్ కాదు. సముద్రం ఒడ్డున 30కిమీ వరకు భూములు లాక్కునే కుట్రలు జరుగుతున్నాయి. అనేక గ్రామాలను కబళించడానికి ప్రయత్నం చేస్తున్నారు" అని మాధవరావు మండిపడ్డారు.

## కేంద్ర ప్రభుత్వం తరఫున మరింత సహకారం అందించాలి

-మొదటిపేజీ తరువాయి

నియమించిన నేపథ్యంలో అమిత్‌షాకు సీఎం థాంక్స్ చెప్పారు. వైకాపా హయాంలో రాష్ట్రంలో ధ్వంసమైన ఆర్థికవ్యవస్థను కేంద్రం అండతో గాడిలో పెడుతున్నామని అమిత్‌షాకు చంద్రబాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరఫున మరింత సహకారం అందించాలని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టును రూ.82వేల కోట్లతో ప్రతిపాదించినట్లు తెలిపారు. గోదావరి మిగులు జలాలను వినియోగించుకునే హక్కు ఏపీకి ఉందన్నారు. ఏపీ ఎదుర్కొంటున్న నష్టంపై ఆర్థిక సంఘానికి నివేదించినట్లు అమిత్‌షాకు సీఎం తెలిపారు.

## జగన్ హయాంలో ఆరోగ్య రంగం పూర్తిగా క్షీణించింది

-మొదటిపేజీ తరువాయి

బ్లాక్‌ను, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, కూటమి నేతలు, వైద్య అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. 2020లో నేషనల్ హెల్త్ అర్బన్ 15వ ఫైనాన్స్ కమిషన్ కింద 520 యూపీహెచ్సీలు మంజూరు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుత యూపీహెచ్సీని కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించామని తెలిపారు. విశాఖకి 48 యూపీహెచ్‌ఎల్‌లు మంజూరయ్యాయని వివరించారు. స్టేట్ క్యాన్సర్ సెంటర్ 2018లో మంజూరయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు. సంవత్సరంలో ఏడు కోట్ల 48 లక్షల ఓపీలు నమోదు అవుతున్నాయని వెల్లడించారు. గత సంవత్సర కాలంగా 17శాతం ఐపీ సేవలు పెరిగాయని... 7శాతం డయగ్నోస్టిక్ టెస్టులు పెరిగాయని తెలిపారు. రాష్ట్రంలో ఓపీ, ఐపీ సేవలు భారీగా పెరిగాయని అన్నారు. సూపర్ స్పెషాలిటీలో 59శాతం వేకెన్సీలు ఉన్నాయని చెప్పారు. టెలి మానస్‌లో భాగంగా మానసిక కౌన్సెలింగ్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు మంత్రి సత్యకుమార్ యాదవ్. గత జగన్ ప్రభుత్వం పేదల వైద్యాన్ని విస్మరించిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నాలుగు సంవత్సరాలు ఎలాంటి నిర్మాణాలు చేయలేదని విమర్శించారు. జగన్ హయాంలో ఆరోగ్య రంగం పూర్తిగా క్షీణించిందని ఆరోపించారు. గత జగన్ ప్రభుత్వంలో భూమిని ఆక్రమించి పార్టీ ఆఫీసులు నిర్మించుకున్నారని.. కానీ పేదల కోసం ఎలాంటి ఆస్పత్రి నిర్మాణాలు చేపట్టలేదని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వానికి కేంద్రం సహాయం చేసినప్పటికీ ఆస్పత్రుల కోసం చర్యలు తీసుకోలేదని.. కానీ వారి సొంతంగా నివాసం ఉండటానికి రుషికొండలో పెద్ద ప్యాలెస్ కట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఏపీలో జగన్ ప్రభుత్వ విధానం వల్ల సైకాలజిస్టుల కొరత ఏర్పడిందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో జగన్ పరామర్శల యాత్రల పేరుతో దండయాత్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏపీలో జగన్ వికృతమైన చేష్టలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సొంత కార్యకర్తల ప్రాణాలను పణంగా పెట్టి దాడులను ప్రోత్సహిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పీవీ నరసింహారావు కృషితోనే ఐటీ విప్లవం

-మొదటిపేజీ తరువాయి

సేవలందించారని గుర్తుచేశారు. దిల్లీలో నిర్వహించిన లెక్చర్ సిరీస్ ఆరో ఎడిషన్ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. 'లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ' అంశంపై ఆయన మాట్లాడారు. "దేశానికి అనేక రంగాల్లో పీవీ నరసింహారావు సేవలందించారు. ఆర్థిక సంస్కరణలు అంటే గుర్తొచ్చేది ఆయనే. లైసెన్స్‌రాజ్ నిబంధనల నుంచి దేశాన్ని బయటకు తెచ్చారు. 1990ల్లో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. సరైన విధానాలు లేక అస్తవ్యస్తంగా ఉండేది. ఆ సమయంలో పీవీ మంచి విధానాలను అమలు చేశారు. ఆయన ప్రధాని అయ్యాక దేశ ఆర్థిక సంస్కరణలు కొత్తరూపు సంతరించుకుని గేమ్ ఛేంజర్‌గా మారాయి. పీవీ నరసింహారావు కృషితోనే ఐటీ విప్లవం వచ్చింది. మైనారిటీ ప్రభుత్వంలోనూ పీవీ చాలా లౌక్యంగా వ్యవహరించారు. పీవీ తెచ్చిన సంస్కరణలను

# అధికారులు ఒక్కొక్క బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలి

**- : ఈనెల 19వ తేదీన స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి**

**- : వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**





**అంకుశం న్యూస్ అనంతపురం, జూలై 15 :** జిల్లాలోని మండల, గ్రామ స్థాయి అధికారులు ఒక్కొక్క బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పంచాయతీ సెక్టార్, జీరో పావర్టీ పీ4, తదితర అంశాలపై డ్వామా పిడి, జడ్పి సిఈఓ, డిపిఓ, ఆర్డీఓలు, డిఎల్డిఓలు, డిఎల్పీఓలు, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీరో పావర్టీ పీ4 కార్యక్రమం కింద జిల్లాలో 54 వేల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందని, ఇందుకోసం మార్గదర్శకుల గుర్తింపు వేగంగా చేపట్టాలన్నారు. ప్రతిరోజు 3,000 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేలా చూడాలని, ప్రతి మండలం నుంచి 100 మంది, మున్సిపాలిటీ నుంచి 200 మంది బంగారు కుటుంబాలను ప్రతిరోజూ దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్లు, వ్యాపారవేత్తలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు. జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలలో భాగంగా తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్ చైల్డ్ ఈకేవైసీ పెండింగ్, గ్రీవెన్స్ పెండింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మన మిత్ర క్యాంపెయిన్ లో హౌస్ హెల్డ్ పెండింగ్ వెంటనే 24 గంటల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ కు సంబంధించి కంబదూరు మండలంలో 57 శాతం మాత్రమే ఉందని, అన్ని చోట్లా ఉద్యోగుల అటెండెన్స్ పూర్తిగా వంద శాతం నమోదయ్యేలా పురోగతి తీసుకురావాలన్నారు. ఏపీ సేవా సర్వీసెస్ రిక్వెస్ట్ లను సకాలంలో పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లాకు అవార్డులు వచ్చేలా కృషి చేయాలని, గ్రామాలు స్వచ్ఛంగా కనబడేలా చూడాలన్నారు. జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్ సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్డబ్ల్యూపిసి షెడ్లను అన్ని చోట్ల పనిచేసేలా చూడాలన్నారు. ఈనెల 19వ తేదీన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలి :ఈనెల 19వ తేదీన ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జూలై నెల "అంతం - ప్లాస్టిక్ కాలుష్యం" అనవసరమైన ప్లాస్టిక్‌లు మరియు సంబంధిత కాలుష్యాన్ని నివారించాలనే థీమ్ తో వచ్చే శనివారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం ప్రజలందరికీ తెలిసే విధంగా టాం టాం వేయించాలని మరియు ప్రకటనలు చేయించి శనివారం రోజున ఏఏ కార్యక్రమాలు ఏ ప్రదేశాలలో జరుగుతాయో తెలియజేసి అందరూ ఇందులో పాల్గొనేలా చూడాలన్నారు. అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, నివారించడం వంటి పనులు చేయాలన్నారు. ఐఈసి యాక్టివిటీలను మండల, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాలని, సింగల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాలని, ఆరోజు క్లాత్ బ్యాగులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

- ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిపిఓ నాగరాజునాయుడు, సిపిఓ అశోక్ కుమార్, జడ్పి సిఈఓ శివశంకర్, ఆధార్ నోడల్ అధికారి నారపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జవాన్ మురళీకి పరిటాల సునీత ఘన నివాళి






- శివపురం గ్రామంలోని జవాన్ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని ఓదార్చిన సునీత
- 50వేల ఆర్థిక సాయం, ఇంటి పట్టా, ఇళ్లు, సోదరికి ఉద్యోగం ఇస్తామన్న సునీత
- జవాన్ కుటుంబాన్ని ఆదుకుంటామన్న మంత్రి నారా లోకేష్



**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 15:** ఛత్తీస్ ఘడ్ లోని రాయ్ పూర్ లో మరణించిన జవాన్ కంచుకుంట మురళీకి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఘనంగా నివాళు లర్పించారు. కనగానపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన సీ.ఆర్.పి.ఎఫ్ జవాన్ కంచుకుంట మురళీ ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం రాయ్ పూర్ లోని 65వ బెటాలియన్ లో విధులు నిర్వహిస్తుండే వారు. ఆర్థిక సమస్యల కారణంతో సోమవారం రోజున తుపాకీతో కాల్చుకొని మరణించాడు. మురళీ భౌతిక కాయం స్వగ్రామానికి చేరుకోగానే.. ఎమ్మెల్యే సునీత అక్కడికి చేరుకున్నారు. శివపురం గ్రామంలో జవాన్ మురళి భౌతిక కాయాన్ని సీ.ఆర్.పీ.ఎఫ్ అధికారులతో కలసి సందర్శించారు. జాతీయ జెండాను భౌతిక కాయంపై ఉంచి గౌరవ వందనం సమర్పించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న భార్య ఇతర కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సునీత ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తక్షణమే 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు జవాన్ సోదరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇంటి పట్టా, ఇళు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి కుటుంబ సభ్యులకు వర్తించే పరిహారాన్ని కూడా త్వరలో అందజేస్తామన్నారు. చిన్న వయసులోనే ఇలా జవాన్ మరణించడం చాలా బాధ కల్గించిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి జవాన్ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. జవాన్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు...

## అలిపిరి పాదాల మండపంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం




**అంకుశం న్యూస్ తిరుపతి జూలై 15:** జూలై 16న ఆణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలిపిరి పాదాల మండపం, శ్రీ ఆండాల్ (గోదాదేవి) సన్నిధి, శ్రీ పెరియాళ్వార్ సన్నిధి, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి సన్నిధిలలో మూల విరాట్టులకు వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, కర్పూరం, గంధం పొడి, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. అటు తర్వాత స్వామి, అమ్మవార్లకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్య కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అంతకుముందు ఆలయం మొదలుకుని గర్భాలయం వరకు, ఉప ఆలయాలు, ఆలయాల ప్రాంగణాలు, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ చేపట్టడం ఆనవాయితీ వస్తోంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీమతి. వి.ఆర్. శాంతి. ఏఈవో ఏ. భాస్కర్ నారాయణ్ చౌదరి, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారంలో రాజీ పడం

**అమడగూరు చినగానీపల్లి పంచాయతీలో ఇంటింటికి కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**





**అంకుశం న్యూస్ పుట్టపర్తి జూలై :15:** పుట్టపర్తి నియోజకవర్గం ఆమడగూరు మండలం చినగానిపల్లి పంచాయతీలో కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో కొన్ని అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఇంటింటికి కార్యక్రమం చేపట్టారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఏపీ అభివృద్ధి శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమం , అభివృద్ధి కార్యక్రమాలను రెండు కళ్లు లా ప్రజలకు అమలు చేస్తోందని తెలిపారు. అంతే కాకుండా నాగరాజుకు మెరుగైన వైద్యం అందించే విధంగా చూడాలని సత్య సాయి జిల్లా వైద్యాధికారి పైరజ్ బేగంతో ఎమ్మెల్యే ఫోన్ ద్వారా మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కూటమి పార్టీల నాయకులు మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి అడ్డుపడుతూ మాపై విమర్శలా...?

**మేయర్ వసీంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**తాము ఏ ప్రతిపాదనలు పంపినా.. మేయర్ అడ్డుకుంటున్నారన్న ఎమ్మెల్యే**





**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 15:** అనంతపురం నగరంలో తాము ఏ అభివృద్ధి పని చేయాలన్నా నగర మేయర్ వసీం అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆరోపించారు. 47వ డివిజన్ రంగస్వామి నగర్ లో ఆయన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నడిమి వంక ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ నిర్మించాల్సిన ప్రొటెక్షన్ వాల్స్, బ్రిడ్జిల గురించి చర్చించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ సౌకర్యాలు, సరుకులు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని పిల్లలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పింఛన్ దారులతో మాట్లాడి ఇంటి వద్దకే పింఛన్ వస్తోందా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబర్ -2 నాటికి డంపింగ్ యార్డ్ ను పూర్తిగా తరలిస్తామని పునరుద్ఘాటించారు. నడిమి వంక, మరువ వంక ప్రొడక్షన్ వాల్స్, బ్రిడ్జి నిర్మాణాలు చేపడతామన్నారు. నేను ఎక్కడ అభివృద్ధి చేశానన్నది మేయర్ పదేపదే ప్రశ్నిస్తున్నారని అయితే ఎక్కడెక్కడ ఎంత మొత్తంలో ఖర్చు చేసి అభివృద్ధి చేశామన్నది పాంప్లెట్ పేపర్ వేసి వివరించామన్నారు. అయినా మేయర్ కు అర్థమైనట్టు లేదన్నారు. మున్సిపాలిటీలో ఏ అభివృద్ధి పనులకు ప్రపోజల్ పెట్టినా అడ్డుకుంటున్నారన్నారు. 45 మంది కార్పొరేటర్లు ఉన్నారని.. కౌన్సిల్ తీర్మానం చేయాలంటూ దాటవేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఆటంకాలను దాటుకుంటూ 118 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. రానున్న నాలుగేళ్లలో అనంతపురం నగరం వైపు రాష్ట్రం మొత్తం చూసేలా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. మరోవైపు జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని వినాశనం చేసి పది లక్షల కోట్లు అప్పు పెట్టి పోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పూర్తిస్థాయిలో కష్టపడుతూ రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. వారిద్దరిపై ప్రజలతో పాటు పెట్టుబడిదారులకు కూడా నమ్మకం ఏర్పడిందన్నారు. అందుకే రాష్ట్రంలో ఏడాది కాలంలోనే 9.50 లక్షలు కోట్ల రూపాయల పెట్టుబడులు, 8.50లక్షలు ఉద్యోగాలు వచ్చాయన్నారు. అనంతపురం జిల్లాకు కూడా పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ నాయకులు, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, దలవాయి రమాదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగుమహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, దత్తాత్రేయ ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్లు బల్లా పల్లవి, సరళ, మల్లెల దుర్గేష్, టిడిపి నాయకుడు రాయల్ మధు, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర నాయకుడు మణి రవి, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, దలవాయి రమాదేవి, దాడి మల్లికార్జున, వడ్డే భవాని, వడ్డే వెంకటేష్, టైలర్ శీన, ఈడీగ నాగభూషణం, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిక్కవోలు రక్షణ శాఖఆధ్వర్యంలో నైతిక విలువల పై అవగాహన సదస్సును లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 15:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం పందలపాక శ్రీ పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు బిక్కవోలు రక్షణ శాఖ ఆధ్వర్యంలో నైతిక విలువల పై అవగాహన సదస్సును పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిర్ల శ్రీనివాసరెడ్డి సభాధ్యక్షులుగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిక్కవోలు మండల ఎస్సై రవిచంద్ర కుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు ప్రస్తుత సమాజంలో జరుగుతున్నటువంటి అనేక చెడు ప్రభావాల గురించి వాటిని అధిగమించి ఏ విధంగా భవిష్యత్తులో ముందుకు వెళ్లాలి, డ్రగ్స్ సిగరెట్ మందు జూదం వంటి కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మొబైల్ వాడకం తగ్గించి అవసరానికి మాత్రమే వాటిని వినియోగించాలని సూచించారు ఎవరైనా పాఠశాలలోనూ పాఠశాల వెలుపల శాంతి భద్రతలకు విఘాతం కలిగించినట్లయితే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని విద్యార్థులు అలాంటి అన్ని కార్యక్రమాలకు దూరంగా ఉండి మంచిని అలవర్చుకొని విద్యను క్రమశిక్షణతో అభ్యసించి ముందుకు వెళ్లాలని సూచించారు అలాగే ఎస్ఓఎస్ యాప్ గురించి విద్యార్థులకు తెలియజేశారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడానికి ఎలాంటి నైతిక విలువలతో కూడిన అవగాహన సదస్సులు ఉపయోగపడతాయని కార్యక్రమాన్ని నిర్వహించిన బిక్కవోలు పోలీస్ శాఖ వారికి పాఠశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోణాల సత్తిరాజు ఉపాధ్యాయ ప్రతినిధి కర్రి వీరిరెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారంపూడి యువ రాజారెడ్డి తల్లిదండ్రుల కమిటీ సభ్యులు జక్క వీరభద్రం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు బిక్కవోలు పోలీసు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# 18న కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

- పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్
- ఎస్ఎస్సీ నుంచి బీటెక్, పీజీ వరకు ఉద్యోగావకాశాలకు వేదిక
- మొగల్రాజపురంలోని పి.బి. సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ లో జాబ్ మేళా

**అంకుశం న్యూస్ విజయవాడ జూలై 15:** కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ నెల 18వ తేదీ నిర్వహించనున్న జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఈ జాబ్ మేళాకు సంబంధించిన సమగ్ర సమాచార పోస్టర్లను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం గురునాక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ, మొగల్రాజపురంలోని పి.బి. సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రాంగణంలో ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకునేలా వివిధ మార్గాల ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నట్లు వెల్లడించారు. యువతకు సుస్థిర ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ లింకు http://naipunyam.ap.gov.in /user-registration లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసిన అర్హత ఉన్నవారికి వివిధ కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వివరించారు. జాబ్ మేళాను సద్వినియోగం చేసుకునేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు , విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ నాగుర్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులకు ఎవ్వరూ భయపడకండి: అనంత వెంకట్రామిరెడ్డి

- ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం, చట్టపరంగా పోరాడుతాం
- రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధం అవ్వండి
- మాజీమంత్రి డాక్టర్ శైలజనాథ్
- రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం





**అంకుశం న్యూస్ అనంతపురం జూలై 15 :** చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతులను చేయాలని ప్రజల పక్షాన పోరాటం చేస్తూ ముందుకు పోవాలని అనంతపురం జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. గార్లదిన్నె మండలం పరిధిలోని కల్లూరు నందు గల స్టార్ కన్వెన్షన్ హాల్ నందు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డా.శైలజానాథ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంకు హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, ఇతర నేతలు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు.లిమాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ మాట్లాడుతూ ఆక్రమ కేసులుకి ఎవరూ భయపడరని పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటామని దేశం పార్టీ అవినీతిపై దౌర్జన్యాలపై ప్రతి ఒక్కరు ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో మన పార్టీని గెలిపించుకోవడానికి అందరము కలిసికట్టుగా కృషి చేయాలని ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ఎవరు భయపడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి శైలజనాథ్ భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్సార్సీపీ కార్యకర్తలు హాజరయ్యారు

## అనపర్తి లో డెంగ్యూ మహోత్సవాల్లో డెంగ్యూ పై అవగాహన కార్యక్రమం




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జులై 15:** అనపర్తి సచివాలయం 4 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం నందు డెంగ్యూ మహోత్సవాలు భాగంలో డెంగ్యూ పై అవగాహన కార్యక్రమం జరపడం జరిగింది. దోమలు కొట్టకుండా తగు జాగ్రత్తలు చెప్పి ఇంటి ఆవరణ ఎదుట నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని చెత్త టైర్లు ఎండిన కొబ్బరి బొండాలు పూల కుండీలు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని నీటి కుండీలపై మూత ఉండాలని రుబ్బురోలు సన్నీ కాళ్లు నీరు ఉండకుండా చూసుకోవాలని ఇంటి సన్ సైడ్ల పైన నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిహెచ్. ఎస్ సి వి లక్ష్మి సిహెచ్.ఓ బి నిర్మల ఎంపీహెచ్ఏ.వై డేవిడ్ టి అనురాధ కె. మనీ వి. రాజకుమారి జై నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం పట్టు చీర కు అగ్రస్థానం!

రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నాగేష్



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 15:** ధర్మవరం పట్టు చీర కు ప్రపంచస్థాయి లో ఖ్యాతి లభించింది. ఇప్పుడు జాతీయ స్థాయి లో ప్రత్యేక గుర్తింపు లభించింది.

ధర్మవరం చీరల డిజైనర్ కళాకారుడు జూజారు నాగరాజు కు జాతీయ అవార్డు లభించడం ఈ పరిశ్రమ కు శుభ సూచకం.అని రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నాగేష్ పేర్కొన్నారు. ఆయన తమ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఒక సమావేశం లో పై విషయం పేర్కొన్నారు. ధర్మవరం పట్టు చీరల పరిశ్రమ కు మరింత ప్రోత్సాహం అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ చెప్పారని అన్నారు. అయితే చేనేత కు ప్రతి ఏటా రూ 24 వేలు ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని కోరడమైనదన్నారు. జాతీయ చేనేత దినోత్సవం అగస్ట్ 7 సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలు అందరూ పండుగ జరుపుకోవాలని పిలుపు నిచ్చారు.

# జగన్మాతకు సారె సమర్పించిన కేశినేని జానకి లక్ష్మీ

300 మంది మహిళలతో అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు

ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి సారెతో బయలు దేరిన కేశినేని జానకి లక్ష్మీ





**అంకుశం న్యూస్ విజయవాడ జూలై 15:** శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మకు ఆషాఢమాసోత్సవాలలో భాగంగా టిడిపి పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళా విభాగం సభ్యులతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకి లక్ష్మీ మంగళవారం సంప్రదాయ పద్ధతిలో సారెను సమర్పించారు. పశ్చిమ నియోజకవర్గంలోని ఎంపీ కేశినేని శివనాథ్ క్యాంపు కార్యాలయం నుంచి వెస్ట్ నియోజకవర్గ తెలుగు మహిళ కమిటీ ఆధ్వర్యంలో 300 మంది మహిళలతో కలిసి కేశినేని జానకి లక్ష్మీ ఊరేగింపుగా అమ్మవారి సారెతో బయిలుదేరారు. పంజా సెంటర్ నుంచి బ్రాహ్మణ వీధి మీదుగా అమ్మ వారి ఆలయం వరకు ఈ ఊరేగింపు సాగింది. వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. తాము తీసుకువచ్చిన పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, పట్టు వస్త్రాలు, మిఠాయిలు, చలిమిడి అమ్మవారికి సమర్పించి కేశినేని జానకి లక్ష్మీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు జానకి లక్ష్మీ ను ఆశీర్వదించి అమ్మ వారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. ఆ తర్వాత ఆరోవ అంతస్తులోని మల్లికార్జున మహా మండపంలో సారెను మూల విరాట్‌కు చూపించి, అర్చకులకు అందజేశారు. పూజానంతరం తనతో వచ్చిన మహిళా భక్తులకి కేశినేని జానకి లక్ష్మీ చలిమిడి ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా కేశినేని జానకి లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ఏడాది లానే ఈ ఏడాది కూడా తెలుగు మహిళ సభ్యులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించటం ఆనందందగా వుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు అందరూ సంతోషం గా ఉన్నారన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుఖాసి సరిత, వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు షేక్ మీరాభి, అంగన్ వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు అచంట సునీత, పాటు తెలుగు మహిళ సభ్యులు పాల్గొన్నారు.

## గోవా గవర్నర్ గా నియామకమైన అశోక్ గజపతిరాజుకు ప్రత్యేక శుభాకాంక్షలు.

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



**అంకుశం న్యూస్ పుట్టపర్తి జులై 15:** గోవా గవర్నర్ గా నియమితులైన టీడీపీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు గారికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియచేశారు. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పాటు ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ప్రజలకు సేవ అందించారు. పార్టీకి ఎంతో నిబద్ధత ,క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశారు. పార్టీనీ నమ్ముకున్న వ్యక్తులకు ఏనాటికైనా తప్పక న్యాయం జరుగుతుందని అన్నారు. పార్టీకి ,ప్రజలకు అత్యున్నత సేవలు అందించిన మంచి వ్యక్తికి ఈ పదవి దక్కడం ఎంతో ఆనందదాయకమన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు పిలుపుమేరకు తెలుగుదేశం పార్టీలో చేరి ఎన్నో అత్యున్నత పదవులను సమర్థవంతంగా నిర్వర్తించారన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో ఆయన మంచి ప్రజా సేవకుడిగా, పాలకుడిగా, మానవతావాదిగా అశోక్ గజపతి రాజు గుర్తింపు పొందారని పేర్కన్నారు. గవర్నర్ పదవిలోనూ అదే సమర్థతతో పనిచేస్తూ రాష్ట్రానికి మంచి గుర్తింపు తెస్తారని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆశాభావం వ్యక్తపరిచారు.

## గండ్రేడు గ్రామం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్ననల్లమిల్లి మనోజ్



**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూలై 15:** పెదపూడి మండలం గండ్రేడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి, ఈ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి, ఇంటింటికి వెళ్ళి ఈ ఏడాది కాలంలో చేసిన గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దాదాపుగా 8 కోట్ల 50 లక్షల 6000 వేల రూపాయలు, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఈ 11 సంవత్సరాలకాలంలో ప్రధాని మోదీ గారి పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కర పత్రాలను అందించి,వివరిస్తున్న యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గండ్రేడు గ్రామంలో జరిగినటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ది పొందిన మొత్తం. రూ.8 కోట్ల 50 లక్షల 6000 వేలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనపర్తి నియోజకవర్గంలో జరిగినటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా పొందిన లబ్ది మొత్తం రూ. 160.3 కోట్ల 3 లక్షలు, రైల్వే శాఖ నుండి 292 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు ద్వారా పొందిన లబ్ది మొత్తంగా 452.2 కోట్ల రూపాయలు విడుదల అయినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల,గండ్రేడు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు,తెలుగు మహిళలు, అధికారులు పాల్గొన్నారు

## ధర్మవరం చేనేత పట్టు చీరకు జాతీయ గుర్తింపు

ఓ డి ఓ పి- 2024 అవార్డును అందుకున్న మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



**అంకుశం న్యూస్ ధర్మవరం జులై 15:** భారత దేశ సమృద్ధమైన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం చేనేత పట్టు చీర 2024 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కార్యక్రమం క్రింద ప్రతిష్టాత్మక జాతీయ అవార్డుకు ఎంపికైంది. ఈ గౌరవం ధర్మవరం పట్టు చీరల ప్రత్యేకతను, నైపుణ్య సంపదను దేశ వ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయంగా కూడా గుర్తింపుచేసే దిశగా కీలకంగా మారనుంది. ఈ సందర్భంగా న్యూ ఢిల్లీ భారత్ మండపంలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం

**మంత్రి సవితమ్మ మాట్లాడుతూ....**

ఈ అవార్డులు వాణిజ్య రంగానికే కాకుండా, స్థానిక పరిశ్రమలకు విశేష ప్రోత్సాహం కలిగిస్తున్నాయన్నారు. ఇది కేవలం హస్తకళల ప్రదర్శన మాత్రమే కాకుండా, భారతదేశ భవిష్యత్తుకు ఒక సాంస్కృతిక గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ఈ అవార్డులు ఆంధ్రప్రదేశ్‌కు లభించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది ఓ డి ఓ పి అవార్డుకు ధర్మవరం చేనేత పట్టు చీరలతో పాటు, కాకినాడ జిల్లా పెద్దాపురం శిల్క్, బాపట్ల జిల్లా చీరాల శిల్క్ చీరలు, తిరుపతి జిల్లా వెంకటగిరి చీరలు కూడా ఎంపికయ్యాయి అని తెలిపారు. ఈ ఎంపిక ద్వారా రాష్ట్రంలోని సంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తుల విలువ మరింతగా పెరిగే అవకాశం కలుగుతుంది అని తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ట్.ఎస్.చేతన్ మాట్లాడుతూ..ధర్మవరం చేనేత కార్మికుల నైపుణ్యానికి, పట్టుదలకు ఇది గౌరవ సూచికని, ఈ అవార్డు వల్ల ధర్మవరం చేనేత రంగానికి మరిన్ని కొత్త అవకాశాలు లభిస్తాయి అని తెలిపారు. మార్కెట్, ఉపాధి అవకాశాలు మరింత పెరగడానికి, అంతర్జాతీయ గుర్తింపు సాధించే మార్గంలో ఇది ఒక మైలురాయి అవుతుందన్నారు. ధర్మవరం చేనేత పట్టు చీరలకు ఈ గౌరవం దక్కినందుకు జిల్లా ప్రజలకు, చేనేత కార్మికులకు వారు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త, కేంద్ర సహాయ వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి జితిన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.